ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
ఆదివారం | జులై 26, 2026 | సంపుటి : 7 | సంచిక : 51 | పేజీలు : 2

## ఘనా, నీలాపతాక అలంకరణలో అమ్మవారు

- పదకొండో రోజు శాకంబరీ ఉత్సవాలు
- ఆలయానికి పోటెత్తిన భక్తులు

### ప్రజాస్వామ్య విజయం

**సోనమ్ వాంగ్‌చుక్**

పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ స్పందిస్తూ, ఇది నేరుగా ప్రజల నుంచి ఉద్భవించిన ప్రజాస్వామ్య విజయమని అన్నారు. భయాన్ని వీడినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సీజేపీ, జెన్‌జీకి అభినందనలు తెలిపుతూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జవాబుదారీతనం నుంచి ఇప్పుడు సంస్కరణల దిశగా మారిందని అన్నారు.



### ప్రజల ఆకాంక్షలే ప్రజాస్వామ్యం

**హైదరాబాద్, ఆయుధం:** 'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఆయన స్పందించారు. తమకు పార్టీ కంటే దేశమే ప్రధానమన్నారు. "ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం, వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. భాజపా దాన్నే పాటిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పార్టీ విలువలను ప్రతిబింబిస్తుంది. ఇన్నేళ్లపాటు దేశసేవలో భాగమైనందుకు ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు" అని ఎక్స్ లో పోస్టు చేశారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి
# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

న్యూఢిల్లీ, ఆయుధం: దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో సంచలన పరిణామం చోటుచేసుకుంది. దేశ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నీట్ పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలు, పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నీట్ పేపర్ లీకేజీపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజన సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజులుగా న్యూఢిల్లీలోని చారిత్రాత్మక జంతర్ మంతర్ వద్ద నీట్ అభ్యర్థులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. విద్యార్థుల నిరసనలకు తీవ్ర నిరసన జ్వాలలు తోడవడంతో కేంద్రంపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. ఎట్టకేలకు విద్యార్థుల సుదీర్ఘ పోరాటం ఫలించడంతో మంత్రి రాజీనామా బాట పట్టక తప్పలేదు.

### నిందితులపై కఠిన చర్యలకు కేంద్రం సిద్ధం

మరోవైపు, నీట్ పేపర్ లీకేజీకి పాల్పడిన సూత్రధారులు, పాత్రధారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. ఈ కుంభకోణంతో సంబంధం ఉన్న నిందితులపై చట్టపరమైన తీవ్ర చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షా విధానంలో కీలక సంస్కరణలు తెచ్చేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది.

# ఆందోళన విరమిస్తున్నాం: సీజేపీ

## ప్రభుత్వంతో ముగిసిన చర్చలు.. డిమాండ్లను అంగీకరించిన కేంద్రం

**ఢిల్లీ, ఆయుధం:** నీట్ లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ నెరవేరడంతోపాటు, మిగతా వాటినీ నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్రంతో సీజేపీ నేతలు మరోసారి చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కేవలం ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరినట్లు చెప్పారు. ''నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లోనూ కేసులతో వేధించబోమని స్పష్టత ఇచ్చింది. నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్రం అంగీకరించింది'' అని తెలిపారు.

### కేసులు ఎత్తేస్తాం: జేపీ నడ్డా

నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు అంగీకరించినట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. ఢిల్లీ, భాజపా పాలిత రాష్ట్రాల్లో పెట్టిన కేసులను ఎత్తివేస్తామన్నారు. ''విద్యావ్యవస్థ, పరీక్షల్లో సమూల మార్పులు చేస్తామని ఇప్పటికే చెప్పాం. భవిష్యత్‌లో ఎవరినీ కేసులతో వేధించబోము. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటాం'' అని జేపీ నడ్డా మీడియా ఎదుట హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు ప్రకటించారు. ఆందోళనకారులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని కోరారు.

### ఏ ప్రభుత్వమైనా తప్ప జరిగితే
## తలవంచాల్సిందే

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనలతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను స్వాగతించారు. విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో తొలి అడుగు పడిందన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల పోరాటం చూసి గర్విస్తున్నట్లు పేర్కొన్నారు. వీధుల్లోకి వచ్చి పోరాడిన యువత, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. మరో రెండు డిమాండ్లు మిగిలి ఉన్నాయని..వాటిని కూడా త్వరగా తీర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆందోళనకారులపై జరిగిన లాఠీఛార్జిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

# మేం సాధించాం
## ఇది విద్యార్థుల విజయం

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సీజేపీ హర్షం
- జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు

**ఢిల్లీ, ఆయుధం:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చేపట్టిన విద్యార్థుల ఆందోళనలతో దిగొచ్చిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. మరోవైపు ప్రధాన్ రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) హర్షం వ్యక్తం చేసింది. ఇది విద్యార్థుల విజయమని, ప్రజాస్వామ్యం అంటే ఇదేనని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మేం దీన్ని సాధించాం. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇదే మొదటి రాజీమానా. మనం భయపడకుండా, ఈ ప్రభుత్వానికి తలొగ్గకపోతే ఎవరి చేతనైనా రాజీనామా చేయించగలమనేదానికి ఇదే నిదర్శనం. శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. ఈ విషయాన్ని మహాత్మ గాంధీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలితానిచ్చింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఇది విద్యార్థుల విజయం. ప్రజాస్వామ్యం అంటే ఇదే' అని దీప్కే అన్నారు. అయితే తమకు రాజకీయాలు అవసరం లేదని దీప్కే అన్నారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దామని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

# రాజకీయాలకతీతంగా సర్ నిర్వహించాలి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హనుమకొండ, ఆయుధం:** రాజకీయాల కతీతంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ "సర్" ను నిర్వహించాలని వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. శనివారం పూలే ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ అధ్యక్షత వయంచి మాట్లాడుతూ చైతన్యవంతమైన తెలంగాణలో మిగతా రాష్ట్రాల మాదిరిగా ఓటర్ల తొలగింపు కుటిలయత్నాలు చెల్లవని, వారం రోజులపాటు ప్రజా సంఘాలు, సామాజిక ఉద్యమకారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పాస్ ఆధ్వర్యంలో 'సర్' ప్రక్రియ పై నిర్వహించిన సెమినార్ లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే నగరాల్లో సర్ ప్రక్రియ మందకొడిగా కొనసాగుతున్నదని అన్నారు. తమ నియోజకవర్గంలో బిఎల్ఓ లు, బిఎల్ఎ ల సహకారంతో ఇప్పటివరకు 58 శాతం సర్ ప్రక్రియ పూర్తి చేయించామని, ఇంకా వారం రోజుల సమయంలో 80 శాతం ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

ఓటు ద్వారానే మన నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉన్నందున అర్హులందరూ సర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని రాజేందర్ రెడ్డి చెప్పారు. రాజకీయాలకు అతీతంగా రాజకీయ పార్టీలు విద్యార్థులు, మేధావులు,అన్ని వర్గాల వారు ఓటు నమోదు ప్రక్రియలో పాల్గొనాలని ఆయన అభ్యర్థించారు.

ఇ ఫ్లూ ప్రొఫెసర్ డాక్టర్ రాజారాం మాట్లాడుతూ సర్ ప్రక్రియ లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆగస్టు 3 వరకు ఈ ప్రక్రియ పూర్తికానుందని, ఆగస్టు 8వ తేదీన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువడుతుందని వివరించారు. 141 కోట్ల జనాభాకు సర్ ప్రక్రియ కొనసాగుతుందని, రెండో విడతలో ఆరు రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటనారాయణ మాట్లాడుతూ సర్ ఫారం లో ఉన్న సంక్లిష్టతలను తొలగించాలన్నారు. యువత పౌర సమాజం బాధ్యత తీసుకొని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడుకునే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్రం ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపల్ ఆర్. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ సర్ ప్రక్రియ పై మీడియా ప్రజలను మరింత చైతన్యవంతులను చేయాల్సి ఉందని అలాగే ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత కూడా అభ్యంతరాలు ఉంటే పరిష్కరింప చేసేలా మీడియా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధ్యాపకులు డా.యాదగిరి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం బలోపేతం కు సర్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

### కూరపాటికి సన్మానం

ఈ సందర్భంగా తెలుగు అకాడమీ చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకట్ నారాయణ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేయూ మాజీ రిజిస్ట్రార్ సదానందం, డాక్టర్ కూరపాటి రమేష్, పాస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మెరుగు బాబు యాదవ్, ఉపాధ్యాయులు దామేర ఉపేందర్, రాజ్ మహమ్మద్, పాస్ నాయకులు డాక్టర్ తాడూరి శాస్త్రి, గొడిశాల సత్యనారాయణ గౌడ్, డాక్టర్ నల్లారి శ్రీనివాస్, జర్నలిజం విభాగం అధ్యాపకులు కంజర్ల నరసింహారాములు, డాక్టర్ వంగాల సుధాకర్, డాక్టర్ సంపత్ కుమార్, డి.రామాచారి, డా.మోటె చిరంజీవి, సురేందర్, శ్రవణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

### కొవ్వొత్తుల ర్యాలీ

**వరంగల్, ఆయుధం:** వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏఏసిసి, పీసీసీ పిలుపుమేరకు వరంగల్ పోచమ్మ మైదాన్ కూడలిలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలని, వారిని వేధించవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జన్ను అనిల్, నగరంలోని వివిధ డివిజన్ అధ్యక్షులు ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు పాల్గొని శాంతియుత ర్యాలీని విజయవంతం చేశారు.

## ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను
# వేగవంతం చేయండి

- పరిహారం చెల్లింపు త్వరగా పూర్తి చేయాలి
- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఆయుధం:** 163జీ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి, గౌరెల్లి , చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపుల పురోగతిని వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ, జాతీయ రహదారుల (మిగతా 2లో..)

## ప్రధాని మోడీ మెడలు వంచిన
# రాహుల్ గాంధీ

- రాహుల్ దెబ్బకు ధర్మేంద్ర ప్రధాన్ ఔట్
- ఇది విద్యార్థుల విజయం
- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**హనుమకొండ, ఆయుధం:** నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో కేంద్రం మెడలు వంచి విద్యార్థుల అభీష్టాన్ని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని... రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ లకు దక్కుతుందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ చెప్పారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 28 రోజులుగా విద్యార్థులు నిరసన తెలుపుతున్నా చీమ కుట్టినట్టైనా లేని ప్రధాని మోడీకి.. విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ మద్దతు పలికి దేశవ్యాప్తంగా ఉద్యమించటంతో దిగిరాక తప్పని పరిస్థితి నెలకొందని అన్నారు. ఇది విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని, రాబోయే రోజుల్లో ప్రధాని మోడీని గద్దెదించటమే తమ కర్తవ్యమని, రాహుల్ గాంధీని ప్రధానిని చేసేంతవరకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. నిరసనల్లో మృతి చెందిన విద్యార్థులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడ్డవారికి తగిన వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలకు కోటి చొప్పున ఎక్స్ గ్రేషియా, ఒక ఉద్యోగం ఇవ్వాలని ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు.